దాదులూరు జాతరకు వేళాయె..

- నేటి నుంచి దాదులూరు పోతలయ్య స్వామి జాతర
- ఎలువగంప ఊరేగింపుతో జాతరకు అంకురార్పణ
- శివ, కేశవులు ఒకేచోట కొలువుదీరిన ఆలయం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- సుదూర ప్రాంతాల నుంచి తరలిరానున్న లక్షలాది మంది భక్తులు





దాదులూరులో జాతీయ రహదారి పక్కన ఉన్న పోతలయ్య స్వామి ఆలయం, కొలువుదీరిన పోతలయ్య, చెన్నకేశవ స్వాములు

కనగానపల్లి: మహా శివరాత్రి తర్వాత ఏటా జరిగే దాదులూరు పోతలయ్య స్వామి జాతర వచ్చేసింది. సుమారు 5 శతాబ్దాల క్రితం నుంచి ఈ జాతర జరుగుతోందని స్థానికులు చెప్పుతున్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ జాతరలో పాల్గుణ శుద్ధ పంచమి రోజున పోతలయ్య స్వామికి నిర్వహించే గావుల మహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది. 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలసిన ఈ దేవాలయం రెండు ఆలయ గోపురాలతో నిర్మించారు. ఇందులో పోతలయ్య, చెన్నేకేశవ స్వామి రూపాల్లో శివ, కేశవులు పక్కపక్కనే కొలువు దీరి ఉండటం విశేషం. వీరితో పాటు బంగారు లింగయ్య స్వామి కూడా ఇక్కడే కొలువుదీరాడు. దీంతో ఏటా పోతలయ్య, చెన్నేకేశవ స్వామి కాపులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చి పూజలు నిర్వహిస్తారు. ఇక పోతలయ్య స్వామికి ప్రత్యేకంగా నిర్వహించే గావుల మహోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. దీంతో ఇక్కడ జరిగే జాతరలో వందల సంఖ్యలో మిఠాయి, గాజులు, బొమ్మల దుకాణాలు వెలుస్తాయి.

మూడు రోజుల పాటు జాతర..

పోతలయ్య స్వామి జాతర ఆదివారం నుంచి మూడు రోజులు పాటు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. ఇందులో తొలిరోజు యలవగంప ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుంది. రామగిరి మండలం గంతిమర్రి, కలికివాండ్లపల్లి గ్రామాల నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపులో పోతలయ్య స్వామి కాపులు స్వామి వారి ఆభరణాలు, పూలను బుట్టల్లో తీసుకొని వచ్చి అలంకరణ చేస్తారు. రెండవ రోజు సోమవారం పోతలయ్య, చెన్నేకేశవ స్వాములకు జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తారు. చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు, భక్తులు పన్నేరు బండ్లతో ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పిస్తారు. ఇక మూడవ రోజు మంగళవారం వేకువజామున నిర్వహించే గావుల మహోత్సవంలో 11 మంది పోతురాజుల చేత స్వామి వారికి మేక పిల్లలను బలి ఇచ్చి పోతలయ్య స్వామికి రక్తతర్పణం చేస్తారు. ఈ జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్, రెవెన్యూ అధికారులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

గావుల మహోత్సవానికి ప్రత్యేకత



పోతలయ్య స్వామి జాతరలో జరిగే గావుల మహోత్సవానికి ఎంతో ప్రత్యేక ఉంది. పాల్గుణ పంచమి గడియల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా పలు ప్రాంతాల నుంచి పోతురాజులు వస్తారు. ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం మధ్య ఉరుముల శబ్దాలతో వీరు నృత్యాలు చేస్తూ.. మేకపోతు పిల్లలను నోటితో కొరికి స్వామికి బలి ఇస్తారు. తర్వాతా వందలాది మూగ జీవాలను భక్తులు స్వామికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

– శివయ్య, ఆలయ పూజారి, దాదులూరు

జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



మూడు రోజుల పాటు జరిగే దాదులూరు జాతరకు గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేశాం. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం, భోజన వసతి కల్పిస్తాం. భక్తుల దర్శనానికి పోతలయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు భక్తులంతా సహకరిస్తే జాతరను వైభవంగా నిర్వహిస్తాం.

– రామలింగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, దాదులూరు

సామాజిక చైతన్యంతోనే భద్రత



అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ, అంగన్‌వాడీ సిబ్బంది

కనగానపల్లి: సామాజిక చైతన్యంతోనే మహిళలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను అరికట్టవచ్చని సీడీపీఓ కవితాదేవి అన్నారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి మహిళా చైతన్యం గురించి తెలియజేశారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ

నల్లచెరువు: మండల కేంద్రంలోని బసవన్నకట్ట వీధిలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. బేటీ బచావో.. బేటీ పడావో అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్త, సూపర్‌వైజర్ రఫీ మున్నీషా, పద్మావతి, లక్ష్మీదేవి, జయమ్మ నల్లచెరువు, తనకల్లు, అమడగూరు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

కదిరి అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మాదిగ ఉద్యోగుల సమాఖ్య, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు ప్రాణాలు త్యాగం చేసిన మాదిగ అమరవీరులను గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు ఆనంద్, ఆంజనేయులు, శ్రీనివాసులు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: ఎస్సీ వర్గీకరణకు ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరుల చిత్రపటాలకు స్థానిక గణేష్ సర్కిల్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు మాతంగి తిప్పన్న, ఎస్‌టీడీ నరసింహులు, రామయ్య, ఫోటో సాయి, పైపల్లి నరసింహులు, బాబు, సత్తెన్న, ఓబులేసు, జెనకప్ప, నరసింహమూర్తి, బండ్లపల్లి ఆంజనేయులు, కొత్తకోట నరసింహులు, యూత్ నాయకులు సాయికుమార్, రాజు, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్‌లో అడంగల్, వన్‌బీలు రావడం లేదు'



తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి సమస్యలు చెప్పుకుంటున్న రైతులు

తాడిమర్రి: ఆన్‌లైన్‌లో అడంగల్, వన్‌బీలు రావడం లేదని పలువురు రైతులు తెలిపారు. శనివారం రామాపురం గ్రామ సర్పంచ్ కుంటాల పుల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పూర్వం నుంచి వారసత్వంగా వస్తున్న వ్యవసాయ భూములకు అడంగల్, వన్‌బీలు రాలేదన్నారు. గ్రామంలో సుమారు 25 మందికి పైగా బాధితులు ఉన్నారని తెలిపారు. రైతుల పట్టాదారు పాసుపుస్తకాల్లో ఉన్న భూముల విస్తీర్ణానికి ఆన్‌లైన్‌లో ఉన్న భూమి విస్తీర్ణానికి తేడాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. వీఆర్‌ఓ, సర్వేయర్ల సమావేశం ఏర్పాటు చేసిన వాటిని సరిదిద్దుతామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే.రాజగోపాల్, పరశురాముడు, వీ.పెద్ద కుళ్లాయప్ప పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

ముదిగుబ్బ: మండలంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ఆదినారాయణ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. శాఖల వారీగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎంపీపీ ఆదేశించారు. అధికారులు బాధ్యతగా పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. వేసవి కాలం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలను తలెత్తకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ బాలముని, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన ఓబులరెడ్డిపల్లి విద్యార్థులు

తలుపుల: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో ఓబులరెడ్డిపల్లి విద్యార్థులు సత్తా చాటారు. 7 బహుమతులు గెలుపొందినట్లు ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత తెలిపారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రాంతిరెడ్డి, కేతన, రేహాన్, ఆసిఫ్, మహీరా, మురీఫా, కిశోర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, పద్మజ , ఎస్‌ఎంసీ సభ్యులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ధర్మవరం అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు పోటీల్లో కూడా రాణించాలని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిన్న తంబి చిన్నప్ప, కార్యదర్శి మంజునాథ్ సూచించారు. శనివారం పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన లిఖిత్ కుమార్, చరణ్ కుమార్, హర్షితకు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భాస్కర్ చేతులమీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పెద్దారెడ్డి, చంద్రశేఖర్, సంస్థ కోశాధికారి చంద్రశేఖర్, డైరెక్టర్లు మనోహర్‌గుప్త, గట్టు వెంకటేశులు, రామకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ




చెన్నేకొత్తపల్లి, కదిరిలో జరిగిన సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులు సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో స్థానిక వెనుకబడిన తరగతులు బాలుర వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థులు శనివారం సరస్వతీదేవి పూజ చేశారు. పూజల్లో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, వసతి గృహం ఇన్‌చార్జ్ అధికారి నరసింహమూర్తి పాల్గొన్నారు. కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, వసతి గృహానికి పేరు తీసుకురావాలన్నారు.

నేడు ఎలువగంప ఉత్సవం




అలంకరణలో పోతులప్ప, చెన్నకేశవ స్వామి

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లి సమీపంలో చింతతోపులో ఆదివారం నుంచి ఈనెల 4వ తేదీ వరకూ చెన్నకేశవ, పోతులప్ప, బంగారు లింగమయ్య స్వాముల ఉత్సవాలు జరగనున్నాయి. వేడుకలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. 2వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు పుట్టపర్తి పురవీధుల్లో ఎలువగంప ఉత్సవం, 3వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు దాసంగాల మడుగు ఉత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఎడ్లబండ్ల పోటీలు, రాత్రికి ఆంధ్ర రాష్ట్ర కళాకారుల ఆధ్వర్యంలో షష్టాంకములు ఉచిత నాటక ప్రదర్శన నిర్వహిస్తారు. 4వ తేదీ మంగళవారం ఉదయం 7 గంటలకు జ్యోతులు, బోనాల ఊరేగింపు, పోతలప్ప, చెన్నకేశవ స్వామి విగ్రహాలకు పూజలు నిర్వహిస్తారు.

నాటుసారాతో అనర్థాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: నాటుసారాతో అనారోగ్యానికి గురవుతారు. ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. నాటుసారా వాడకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆర్డీఓ మహేష్, పుట్టపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్, అనంతపురం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నవోదయం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా నాటుసారా తయారు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. నాటుసారా మానేద్దాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అన్న స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం అనే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ సీఐ ఫరూక్ అజాం, ఎస్‌ఐ చాంద్‌బాషా పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

బత్తలపల్లి: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 3వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలు తీసుకుంటున్నాయన్నారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి అన్ని చెరువులకు నీరు ఇవ్వాలన్నారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ పేరుతో రైతుల భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే నిలుపుదల చేసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. అంతకు ముందు రైతులను కలిసి ధర్నాకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మారుతి, మండల నాయకులు రాజా, పుల్లయ్య, వెంకటనారాయణ, రాము రామాంజీ, శ్రీరాములు, నారాయణస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సాకే లక్ష్మన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని శనివారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్, అనంతపురం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ చంద్రమణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలను అందిస్తున్న వైద్యాధికారులు

ధర్మవరం రూరల్: గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం దర్శనమల పీహెచ్‌సీ వైద్యాధికారిణీ పుష్పలత, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కంటి జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం జగన్నాథం, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, సీహెచ్‌ఓ అఖిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6న సుంకాల వసూలుకు వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో దుకాణాల నుంచి సుంకం వసూలు హక్కుల కోసం ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.3,50,000 ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

9న ఉచిత కంటి వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 9వ తేదీన ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహా, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో శనివారం వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కంటిచూపు తగ్గిన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, రత్నశేఖర్ రెడ్డి, కొండయ్య, శివయ్య, పెరుమాల్ దాస్, వెంకటాచలం, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ధర్మవరం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,835 మంది విద్యార్థులకు గాను 1,786 మంది పరీక్షలకు హాజరయ్యారు. 49 మంది గైర్హాజరయ్యారు.

అమడగూరు: శీతిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం 186 మంది, ద్వితీయ సంవత్సరం 117 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నాట్లు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ పేర్కొన్నారు.

పైపులైన్ ఏర్పాటు



ఉప్పార్లపల్లిలో రోడ్డుపై మురుగు పారకుండా పైపులైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

నల్లచెరువు: మండలంలోని బాలేపల్లి తండా, పోలేవాండ్లపల్లి, కె.పూలకుంట, దామవాండ్లపల్లి, ఉప్పార్లపల్లి, ఓరువాయి గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. మురుగు.. వీధుల్లో పరుగు శీర్షికతో శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ రఘునాథగుప్త, ఈఓఆర్డీ శకుంతల, డాక్టర్ కల్పన రెడ్డి, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, సర్పంచులు సోనాలమ్మ, హర్షవర్ధన్ నాయుడు, యూసుఫ్, పంచాయితీ కార్యదర్శులు విజయ్, ఆనంద్, నరసింహులు, నరేష్ ఆయా గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించారు. రోడ్లుపై మురుగు నీరు ఉన్న చోట పారిశుధ్య కార్మికులు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఉప్పార్లపల్లిలో సర్పంచ్ హర్షవర్ధన్ నాయుడు మురుగు నీరు రోడ్లపై పారకుండా జేసీబీల సాయంతో కాలువ తవ్వించి పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు సుధాకర్, మహబూబ్ బాషా, హెచ్‌ఏలు సూర్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, వార్డు మెంబర్ నాగరాజు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ చెన్నకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

కదిరి అర్బన్: పట్టణంలోని సెయింట్ థామస్, నారాయణ, చైతన్య పాఠశాలల యాజమాన్యాలు నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు కోరారు. శనివారం మండల విద్యాధికారి చెన్నకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరం ముగియకనే 2025–26 విద్యా సంవత్సరం అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో లేని సౌకర్యాలు ఉన్నట్లు చూపిస్తూ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు అతిక్రమిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్, నాయకులు ఫయాజ్, చంద్రమౌళి, రమణ, మురళీ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



రేషన్ పంపిణీని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ దేవేంద్ర నాయక్

ఎన్పీకుంట: రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎండీయూ ఆపరేటర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దేవేంద్ర నాయక్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని టీ.ఎస్.పల్లి పంచాయతీలో ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేస్తున్న రేషన్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండీయూ ఆపరేటర్లకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో కార్డుదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీ చేయాలని తెలిపారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించమని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వస్తువులు విక్రయించాలని సూచించారు. అలాగే ఆదే పంచాయతీలో సామాజిక పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

వాహనాల తనిఖీ

తలుపుల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ నరసింహుడు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బట్రేపల్లి రోడ్డులో రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఇకపై ఇష్టానుసారంగా వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదన్నారు. రికార్డులు, లైసెన్స్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గురప్ప, నల్లప్ప, కానిస్టేబుల్ బాబూ నాయక్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అశోక్ కుమార్ నాయక్



చెన్నేకొత్తపల్లి: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అశోక్‌కుమార్ నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న శివశంకరప్ప పదవీ విరమణ చేయడంతో ఉన్నతాధికారులు ఈఓఆర్డీగా పని చేస్తున్న అశోక్‌కుమార్ నాయక్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా వేసవిలో మండలంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తామన్నారు.